జంగల్ మే దంగల్!

- ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో దూకుడు పెంచిన ఆపరేషన్ 'కగార్'
- వేల సంఖ్యలో అడవులను చుట్టుముట్టిన సాయుధ బలగాలు
- ఆరుమాసాల్లో 120 మంది మావోయిస్టులు మృతి
- మావోయిస్టు పార్టీకి ముంచుకొస్తున్న పెనుముప్పు

కొత్తగూడెం క్రైం, జూన్ 8 : ఛత్తీస్‌గఢ్ దండకారణ్యంలో కేంద్రం దండయాత్ర కొనసాగిస్తోంది. మావోయిస్టు పార్టీ చర్యలను నిర్మూలించే దిశగా వేగంగా పావులు కదుపుతోంది. తెలంగాణ-ఛత్తీస్‌గఢ్-మధ్యప్రదేశ్ సరిహద్దుతో పాటు ఆంధ్రా-ఒడిశా సరిహద్దుల్లో సైతం కేంద్ర బలగాలు నలుదిక్కుల నుంచి చుట్టముట్టి ముప్పేట దాడికి దిగుతున్నాయి. వరుసగా జరుగుతున్న దాడులు మావోయిస్టు పార్టీ నిర్మూలనకేనని సంకేతాలనిస్తున్నాయి. ఒకవైపు పెద్ద సంఖ్యలో తమ బలగాన్ని కోల్పోతున్న మావోయిస్టు పార్టీ మరోవైపు ఏజెన్సీ ప్రాంతాల నుంచి రిక్రూట్‌మెంట్‌లతో ముందుకెళ్తూనే ఉంది. కేంద్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర ప్రభుత్వాలు ఆపరేషన్ 'కగార్' పేరుతో దండకారణ్యంపై పట్టుసాధించేందుకు దూకుడు ప్రదర్శిస్తున్నాయి. ఇప్పటికే ఈ ఏడాదిలో మావోయిస్టు పార్టీ తమ క్యాడర్‌ను పెద్దఎత్తునే కోల్పోయినట్లు తెలుస్తోంది. అయితే ఒకవైపు ప్రతి కారేచ్చతో రగిలిపోతున్న మావోయిస్టులు ఛత్తీస్‌గఢ్ దండకారణ్యం కేంద్రంగా విధ్వంసక చర్యలకు పాల్పడుతున్నారు. ఇన్ఫార్మర్ నెపంతో హత్యలు, ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులకు నష్టం చేస్తూ, భద్రతా బలగాలను టార్గెట్ చేస్తూ ల్యాండ్‌మైన్స్, బూబీ ట్రాప్స్ ఏర్పాటు చేయడం వంటి విధ్వంసక చర్యలకు పాల్పడుతున్నారు. దీంతో ఛత్తీస్‌గఢ్ దండకారణ్యంపై యుద్ధమేఘాలు అలుముకున్నాయి. ప్రస్తుతం అక్కడ నెలకొన్న పరిస్థితులను అధిగమించడంతోపాటు మావోయిస్టులను 'లోన్ వర్రాటు' కార్యక్రమంతో జనజీవన స్రవంతివైపునకు తరలించడం, లేదా ఏజెన్సీపై దాడులు చేసి మావోయిస్టులను అరెస్ట్ చేయడమే లక్ష్యంగా భద్రతా బలగాలు పనిచేస్తున్నాయి.

ఆరుమాసాల్లో 120మంది..

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నారాయణ్‌పూర్ జిల్లాలో గల అబూజ్‌మడ్ దండకారణ్యాన్ని కంచుకోటగా చేసుకుని మావోయిస్టులు తమ వ్యూహాలను రచిస్తున్నారు. అయితే ఇప్పటికే అది పసిగట్టిన పోలీస్ అధికారులు ప్రతివ్యూహాలతో 'ఆపరేషన్ కగార్' పేరుతో అష్టదిగ్బంధనం చేసి దాడులను ముమ్మరం చేస్తున్నారు. బస్తర్ రేంజ్ ఐజీ సుందర్‌రాజ్ పాటిలింగ్ నేతృత్వంలో బీజాపూర్, నారాయణ్‌పూర్, దంతేవాడ, సుక్మా, కాంకేర్, జగ్దల్‌పూర్ జిల్లాల ఎస్పీలు దండోపోయాలను అమలుచేస్తూ ఎన్‌కౌంటర్ల పరంపరకు తెరలేపుతున్నారు. ఈ క్రమంలోనే ఏప్రిల్ 2వ తేదన బీజాపూర్ జిల్లా పోర్చేలి అడవుల్లో జరిగిన ఎదురుకాల్పుల్లో 11మంది మావోయిస్టులు హతమయ్యారు. ఏప్రిల్ 6వ తేదీన బీజాపూర్ జిల్లా పూజారీకాంకేర్ అడవుల్లో తెలంగాణ గ్రేహౌండ్స్, ఛత్తీస్‌గఢ్ పోలీసుల సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఎదురుకాల్పుల్లో ముగ్గురు మావోయిస్టులు మరణించారు. ఏప్రిల్ 16వ తేదీన కాంకేర్ జిల్లాలోని బినాగూడ-కొరగట్ట అడవుల్లో చాలాకాలం తరువాత జరిగిన అతిపెద్ద ఎన్‌కౌంటర్‌లో సుమారు 30మంది మావవోయిస్టులు చనిపోయారు. ఏప్రిల్ 30వ తేదీన నారాయణ్‌పూర్-కాంకేర్ జిల్లా సరిహద్దులోని అబూజ్‌మడ్ అడవుల్లో జరిగిన ఎదురుకాల్పుల్లో 10మంది మావోయిస్టులు మృతిచెందారు. మే 10వ తేదీన బీజాపూర్ జిల్లా గంగలూరు పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఎదురుకాల్పుల్లో 12మంది నేలరాలారు. మే 23వ తేదీన నారాయణ్‌పూర్-బీజాపూర్ సరిహద్దుల్లోని అబుజ్‌మడ్ పరిధిలోని ఓర్చా అడవుల్లో జరిగిన ఎదురుకాల్పుల్లో 8మంది హతమయ్యారు. తాజాగా ఈ నెల 7వ తేదీన నారాయణ్‌పూర్-దంతేవాడ జిల్లాల సరిహద్దుల్లో జరిగిన ఎదురుకాల్పుల్లో ఏడుగురు మావోయిస్టులు మృతిచెందారు. ఈ ఏడాదిలో జరిగిన ఈ అతిపెద్ద ఆపరేషన్స్‌లో పదుల సంఖ్యలో మావోయిస్టులు నేలకొరిగారు. దీంతో ఇప్పటివరకు 120 మంది మావోయిస్టులు పోలీసుల ఎదురుకాల్పుల్లో బలైపోయారు.

ముంచుకొస్తున్న ముప్పు..!

మావోయిస్టు పార్టీ తమ సామ్రాజ్యాన్ని విస్తరించుకునే పనిలో ఉన్నప్పటికీ భద్రతా బలగాలు ముప్పేటదాడికి సిద్ధమవుతున్నాయి. కేంద్ర హోంశాఖ మంత్రి, ఛత్తీస్‌గఢ్ హోం మంత్రులు ఇటీవల మావోయిస్టు పార్టీతో చర్చలకి ఆహ్వానించడం, మావోయిస్టు పార్టీ సైతం షరతులతో కూడా చర్చలకు సిద్ధంగా ఉన్నట్లు లేఖలు విడుదల చేయడం జరిగినప్పటికీ అవి కేవలం ప్రచారానికి పరిమితమయ్యాయి. ప్రస్తుతం చోటు చేసుకుంటున్న పరిణామాల దృష్ట్యా గత నెల మళ్లీ ఛత్తీస్‌గఢ్ గృహ మంత్రి మావోయిస్టులతో చర్చలకు సిద్ధంగా ఉన్నట్లు పిలుపునిచ్చారు. ఒకవైపు చర్చలకు సిద్ధంగా ఉన్నామంటూ రెండు వైపులా నుంచి సానుకూల సంకేతాలున్నప్పటికీ మరోవైపు సమరశంఖం మోగుతూనే ఉంది. ఇటికే ఛత్తీస్‌గఢ్ ఏజెన్సీలోని మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో అడుగడుగునా ప్యారామిలటరీ క్యాంపులు వెలిశాయి. వేలసంఖ్యలో భద్రతా దళాలు అడవులను చుట్టుముట్టాయి. సాంకేతిక పరిజ్ఞానాన్ని అడవులపై వినియోగిస్తూ మావోయిస్టుల జాడలు తెలుసుకుని పక్కా ప్రణాళికతో దాడులు చేస్తున్నాయి. ఏజెన్సీల్లో తలదాచుకున్న మావోయిస్టులు అడవులకు వెళ్లిపోతున్నారు. మరికొందరు జనజీవన స్రవంతిలో కలిసేందుకు వచ్చి పోలీస్ అధికారుల ఎదుట లొంగిపోతున్నారు. దీంతో మావోయిస్టులు సైతం కొన్ని రిమోట్ ఏరియాలను తమ ఆధీనంలోకి తీసుకుని ఆయా ప్రాంతాల్లో భద్రతా బలగాలను టార్గెట్ చేస్తూ వ్యూహాలు రచిస్తున్నారు. ఈ క్రమంలోనే ఇటీవల ఓ గ్రామస్తుడు మావోయిస్టులు అమర్చిన బూబీట్రాప్ పేలి మృతిచెందిన విషయమై మావోయిస్టు పార్టీ లేఖను విడుదల చేయడం విశేషం. వరుసగా ఎదురవుతున్న ఈ పరిణామాలు మావోయిస్టు పార్టీ ఉనికికే ముప్పు తెచ్చే విధంగా ఉన్నట్లు తెలుస్తోంది.

పలకరించిన తొలకరి

భద్రాద్రి జిల్లాలో కురిసిన భారీ వర్షం

జాతీయ రహదారిపైకి చేరిన వరద నీరు

ఇబ్బందిపడిన వాహనదారులు, పాదచారులు

కొత్తగూడెం టౌన్ : పట్టణంలో కురుస్తున్న వర్షం

కొత్తగూడెం టౌన్/పాల్వంచ/చుంచుపల్లి, జూన్ 8 : మృగశిర కార్తె మొదటిరోజే తొలకరి పలకరించింది. రోహిణి కార్తెతో ఎండలతో సతమతమైన ప్రజలు వర్షాన్ని స్వాగతిస్తూ హర్షం వ్యక్తం చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంతో పాటు చుంచుపల్లి, పాల్వంచ పట్టణంలో శనివారం మధ్యాహ్నం 3 గంటల నుంచి ఆకాశం మేఘావృతమై ఒక్కసారిగా ఉరుములు, మెరుపులతో మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయం కావడంతో వాహనదారులు, పాదచారులు, చిరు వ్యాపారులు ఇబ్బందిపడ్డారు. డ్రైనేజీలు పొంగి ప్రవహించాయి. పాల్వంచ జాతీయ రహదారిపై డ్రైనేజీ లేని చోట వర్షం నీరు నిలిచిపోయింది. బస్టాండ్ ఆవరణలో వరద నీరు నిలిచి ప్రయాణీకులు ఇబ్బంది పడ్డారు. స్లమ్ ఏరియాలో డ్రైనేజీలు పొంగి రోడ్లపై నీళ్లు ప్రవహించాయి. చుంచుపల్లి మండల కేంద్రంలోని విద్యానగర్ కాలనీలో యూనియన్ బ్యాంకు ఎదుట జాతీయ రహదారిపై మోకాళ్లలోతు వరద నీరు చేరింది. వర్షపు నీరు ఎటూ వెళ్లే మార్గం లేకపోవడంతో చెరువును తలపించింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

చుంచుపల్లి: జాతీయ రహదారిపై భారీగా నిలిచిన వరద

చుంచుపల్లిలో..

పాల్వంచ : జాతీయ రహదారి పక్కన డ్రైనేజీ లేక నిలిచిన వరద

ఛత్తీస్‌గఢ్ ఎన్‌కౌంటర్ మృతుల గుర్తింపు

కొత్తగూడెం క్రైం, జూన్ 8 : ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నారాయణ్‌పూర్ జిల్లాలో శుక్రవారం భద్రతా బలగాలు, మావోయిస్టులకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో ఏడుగురు మావోయిస్టులు మృతిచెందిన విషయం విదితమే. అయితే ఏడుగురిలో ఆరుగురి వివరాలను పోలీసు అధకారులు వెల్లడించారు. మృతి చెందిన మావోయిస్టుల్లో రూ.8 లక్షల రివార్డు గల 6వ నెంబర్ కంపెనీ 2వ ప్లాటూన్ బీ సెక్షన్‌కు చెందిన రమేశ్ అలియాస్ బోజా(30), రూ.8 లక్షల రివార్డు గల పీపీసీఎం మసియా అలియాస్ మెసియా మందామి, రూ.5 లక్షల రివార్డు గల ఏసీఎం సైతా సలామ్ అలియాస్ చేతన్ అలియాస్ జయ్‌లాల్ సలామ్, మిలీషియా మెంబర్లు రూ.లక్ష రివార్డు గల సుందరి, రూ.లక్ష రివార్డు గల సజంతి పోయం, రూ.లక్ష రివార్డు గల ఆదెరబేడా సీఎన్ఎం కమాండర్ జనని అలియాస్ జన్ని ఉన్నట్లు పేర్కొన్నారు.

సింగరేణి లాభాలవాటా 35 శాతం ప్రకటించాలి

సీఎండీని కలిసిన జనక్ ప్రసాద్


సీఎండీకి వినతిపత్రం ఇస్తున్న జనక్‌ప్రసాద్

కొత్తగూడెం సింగరేణి, జూన్ 8: 2023-24 ఆర్థిక సంవత్సరం ముగిసి రెండు నెలలు కావస్తున్నా కోడ్ కారణంగా ఇప్పటి వరకు ప్రకటించని లాభాల వాటాను వెంటనే ప్రకటించాలని సీఎండీ బలరాంను ఐఎన్టీయూసీ జనరల్ సెక్రెటరీ జనకల్ ప్రసాద్ కోరారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో 67.13 మిలియన్ టన్నుల ఉత్పత్తి చేస్తే 33 వేల కోట్ల బిజినెస్ జరిగి రూ.2222 కోట్లు లాభాలు వచ్చాయని, దానిలో 32 శాతం అంటే రూ.711.18 కోట్లు చెల్లించారని అన్నారు. సీఎండీగా బాధ్యతలు చేపట్టిన బలరాం ఈ ఆర్థిక సంవత్సరానికి రికార్డు స్థాయిలో 70.12 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేశారని, అందుకు గాను 37 వేల కోట్ల బిజినెస్ జరిగిందని, గతంతో పోలిస్తే ఈ ఆర్థిక సంవత్సరానికి రికార్డు స్థాయిలో ఉత్పత్తి సాధించారన్నారు. కార్మికుల కోసం ఈ సారి లాభాల వాటా 35 శాతం ప్రకటించాలని కోరారని ఏరియా ఐఎన్‌టీయూసీ ఉపాధ్యక్షుడు ఎండీ రజాక్ తెలిపారు.

రూ.2,080 తగ్గిన తులం ధర

హైదరాబాద్‌లో **రూ.71,670**

దిగొచ్చిన బంగారం

హైదరాబాద్, జూన్ 8: బంగారం కొండ దిగుతున్నది. గత మూడు రోజులుగా పెరుగుతూ వచ్చిన పుత్తడి భారీగా దిగొచ్చింది. అంతర్జాతీయ మార్కెట్లో అనూహ్యంగా అతి విలువైన లోహాలు ధరలు ఒక్కసారిగా తగ్గడంతో దేశీయంగా ధరలు చౌకతున్నాయి. హైదరాబాద్ బులియన్ మార్కెట్లో 24 క్యారెట్ తులం పుత్తడి ధర రూ.2,080 తగ్గి రూ.71,670కి దిగొచ్చింది. అంతకుముందు ఇది రూ.73,750గా ఉన్నది. అలాగే 22 క్యారెట్ బంగారం ధర రూ.1,900 తగ్గి రూ.67,600 నుంచి రూ.65,700గా నమోదైంది. అగ్రరాజ్యం అమెరికాలో నిరుద్యోగ గణాంకాలు తగ్గుముఖం పట్టడం, ద్రవ్యోల్బణ గణాంకాలు పుంజుకోవడంతో బంగారం ధరలు తగ్గడానికి ప్రధాన కారణమని బులియన్ వర్తకులు వెల్లడిస్తున్నారు. పారిశ్రామిక వర్గాలు, నాణేల తయారీదారుల నుంచి కొనుగోళ్లు నిలిచిపోవడంతో కిలో వెండి ఏకంగా రూ.4,500 తగ్గింది. దీంతో కిలో వెండి రూ.1,00,500 నుంచి రూ.96 వేలకు దిగొచ్చింది. అలాగే న్యూఢిల్లీలో తులం బంగారం రూ.2,080 దిగి రూ.71,820కి తగ్గింది. పసిడితోపాటు వెండి ధరలు కూడా భారీగా తగ్గాయి. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ గోల్డ్ ధర శుక్రవారం ఒకరోజు 79.70 డాలర్లు తగ్గి 2,311.20 డాలర్లకు పడిపోయింది. అలాగే వెండి 2 డాలర్లు తగ్గి 29.27 డాలర్లుగా నమోదైంది.

అదానీ చేతికి కోల్‌కతా పోర్ట్

ఓడరేవులపై పెరుగుతున్న గ్రూపు ఆధిపత్యం

దేశ తీర ప్రాంతం దాదాపుగా హస్తగతం



న్యూఢిల్లీ, జూన్ 8: అదానీ గ్రూప్ గుప్పిట్లోకి దేశంలోని మరో పోర్టు వచ్చింది. అదానీ పోర్ట్స్ అండ్ స్పెషల్ ఎకనామిక్ జోన్ (ఏపీసెజ్) లిమిటెడ్.. కోల్‌కతాలోని శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ పోర్టు కంటైనర్ ఫెసిలిటీ కార్యకలాపాలు, నిర్వహణ కోసం ఐదేండ్ల కాంట్రాక్టును కుదుర్చుకున్నది. కాంపిటీటివ్ బిడ్డింగ్ ప్రక్రియ ద్వారా ఈ డీల్‌ను పొందినట్టు ఏపీసెజ్ ఓ ప్రకటనలో వెల్లడించింది. కాగా, ఇప్పటికే దేశంలోని 13 పోర్టులు, టెర్మినల్స్ అదానీ గ్రూప్ ఆధ్వర్యంలో పనిచేస్తున్నవే కావడం గమనార్హం. వీటిలో 45 బెర్తులున్నాయి. ముంద్రాలోగల దేశీయ తొలి పోర్ట్ ఆధారిత సెజ్, తిరువనంతపురంలోగల తొలి డీప్ వాటర్ ట్రాన్స్‌షిప్‌మెంట్ పోర్ట్ కూడా అదానీ సొంతమే.

ఏడు నెలల్లోగా..

లెటర్ ఆఫ్ యాక్సెప్టెన్స్ (ఎల్‌వోఏ) తేదీ నుంచి ఏడు నెలల్లోగా కోల్‌కతా కంటైనర్ ఫెసిలిటీలో కార్గో హ్యాండ్లింగ్ ఎక్విప్‌మెంట్‌ను అదానీ పోర్ట్స్ సంస్థ అందుబాటులోకి తేవాల్సి ఉన్నది. ఇక తమ నిర్వహణలో నేతాజీ సుభాష్ డాక్ వద్ద టెర్మినల్‌కు, కంటైనర్ పోర్ట్స్‌కు మధ్య కనెక్టివిటీ మెరుగవుతుందన్న ధీమాను ఏపీసెజ్ వ్యక్తం చేస్తున్నది. ముఖ్యంగా ఈ ఏడాది విజింజమ్, కొలంబోల్లో ట్రాన్స్‌షిప్‌మెంట్ హబ్‌ల ఏర్పాటే లక్ష్యంగా ముందుకు కదులుతున్నట్టు చెప్తున్నది. 'దేశవ్యాప్తంగా ఆయా పోర్టులు, లాజిస్టిక్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధిలో మాకున్న చిత్తశుద్ధి, అంకితభావం వల్లే నేతాజీ సుభాష్ డాక్ కాంట్రాక్టును కూడా దక్కించుకోగలిగాం' అని ఏపీసెజ్ సీఈవో అశ్వినీ గుప్తా అన్నారు. దేశ, విదేశాల్లోని వివిధ కంటైనర్ టెర్మినల్స్ నిర్వహణలో తమ సంస్థకున్న రెండు దశాబ్దాలకుపైగా అనుభవం పశ్చిమ బెంగాల్ ప్రజలకు, కస్టమర్లకు ప్రయోజనకరంగా మారుతున్నదని కూడా చెప్పారు.

తూర్పు తీరంలో..

భారత తూర్పు తీరంలో కోల్‌కతాలోని నేతాజీ సుభాష్ డాక్.. అతిపెద్ద కంటైనర్ టెర్మినల్‌గా ఉన్నది. గత ఆర్థిక సంవత్సరం (2023-24)లో ఇక్కడ దాదాపు 0.63 మిలియన్ టీఈయూ (20 అడుగులకు సమానమైన యూనిట్) హ్యాండ్లింగ్ జరిగింది. పశ్చిమ బెంగాల్‌తోపాటు బీహార్, ఉత్తరప్రదేశ్, జార్ఖండ్, అస్సాం, ఇతర ఈశాన్య రాష్ట్రాలతో పాటు నేపాల్, భూటాన్‌లకు సేవలు అందాయి. ఈ డాక్‌కు సింగపూర్, పోర్ట్ కెలాంగ్, కొలంబో పోర్ట్ హబ్‌ల నుంచి రెగ్యులర్ లైన్ సర్వీస్ కాల్స్ కూడా ఉన్నాయి.

మోదీ హయాంలోనే..

మోదీ హయాంలోనే అదానీ గ్రూప్ అన్ని రంగాల్లో వేగంగా విస్తరించుకుంటూ పోయింది. ముఖ్యంగా దేశంలోని దాదాపు అన్ని ఓడరేవులు, కీలక విమానాశ్రయాలు ఇప్పుడు గౌతమ్ అదానీ కనుసన్నల్లోనే ఉన్నాయంటే ఎంతమాత్రం అతిశయోక్తి కాదు. వడ్డించేవాడు మనవాడైనప్పుడు బంతిలో ఏ మూలన కూర్చున్నా విందు భోజనమే. దీనికి తగ్గట్టుగానే గత పదేండ్లుగా కేంద్రంలో బీజేపీ సర్కారు అధికారంలో ఉన్న నేపథ్యంలో బిడ్డింగ్‌లో పాల్గొంటే చాలు ఆ కాంట్రాక్టు అదానీదే అన్నట్టు తయారవుతున్నది పరిస్థితి. గుజరాత్ (4), ఆంధ్రప్రదేశ్ (2), తమిళనాడు (2), గోవా (1), మహారాష్ట్ర (1), కేరళ (1), పుదుచ్చెరి (1), ఒడిషా (1)ల్లో అదానీకి పోర్టులున్నాయి. ఇప్పుడు పశ్చిమ బెంగాల్ సైతం ఈ లిస్టులో చేరింది. శ్రీలంక, ఆస్ట్రేలియా, ఇజ్రాయెల్‌లోనూ ఉన్నాయి.

వాణిజ్య

ఎల్‌జీ 64 ఇంచుల ఓఎల్ఈడీ టెలివిజన్

ధర రూ.1.80 లక్షలు

హైదరాబాద్, జూన్ 8: దేశీయ మార్కెట్లోకి సరికొత్త టీవీను అందుబాటులోకి తీసుకొచ్చింది ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ ఇండియా. నూతన టెక్నాలజీ కోరుకుంటున్న వారిని దృష్టిలో పెట్టుకొని 64 అంగుళాల ఓఎల్ఈడీ సీ4 కృత్రిమ మేధస్సు టీవీను హైదరాబాద్‌లో విడుదల చేసింది. ఈ టీవీ ప్రారంభ ధర రూ.1,79,999గా నిర్ణయించింది.

నేషనల్ మార్ట్ మరో ఔట్‌లెట్

హైదరాబాద్, జూన్ 8: రిటైల్ ఔట్‌లెట్ సంస్థ నేషనల్ మార్ట్.. హైదరాబాద్‌లో మరో అవుట్‌లెట్‌ను ఏర్పాటుచేసింది. సంస్థకు ఇది ఏడో ఔట్‌లెట్ కావడం విశేషం. మెహదీపట్నంలో ఏర్పాటు చేసిన ఈ స్టోర్‌ను ఏఐఎంఐఎం ప్రెసిడెంట్ అసదుద్దిన్ ఓవైసీ ప్రారంభించారు. ఈ సందర్భంగా కంపెనీ ఫౌండర్ యశ్ అగర్వాల్ మాట్లాడుతూ..అతి తక్కువ ధరకే నాణ్యమైన అన్ని రకాల ఉత్పత్తులను అందించడం వల్లనే కస్టమర్లను ఆకట్టుకోగలుగుతుంది.

హోండా కార్లపై ప్రత్యేక ఆఫర్లు

రూ.88 వేల వరకు రాయితీ ఇస్తున్న సంస్థ



న్యూఢిల్లీ, జూన్ 8: ప్రముఖ కార్ల తయారీ సంస్థ హోండా కూడా కొనుగోలుదారులను ఆకట్టుకోవడానికి ప్రత్యేక ఆఫర్లను తెరపైకి తీసుకొచ్చింది. ఈ నెలలో నూతన వాహనాన్ని కొనుగోలు చేయాలనుకునేవారికి బంపర్ ఆఫర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. 'హోండా సమ్మర్ బొనాంజా' పేరుతో ప్రకటించిన ఈ ఆఫర్ కింద రూ.88 వేల వరకు రాయితీ ఇస్తున్నది. ఈ ఎక్స్‌క్లూజివ్ ఆఫర్‌లో ఒక జంట ప్యారిస్ లేదా రూ.75 వేల నగదును గెలుచుకునే అవకాశం కూడా సంస్థ కల్పించింది. ఈ నెల చివరి వరకు హోండా ఎలివేట్, హోండా సిటీ, సిటీ-ఈ:హెచ్ఈవీ, హోండా అమేజ్‌లను కొనుగోలు చేసిన వారికి మాత్రమే ఈ ఆఫర్ వర్తించనున్నదని పేర్కొంది. వీటిలో హోండా అమేజ్‌పై రూ.76 వేల ప్రయోజనాలు అందిస్తున్న సంస్థ.. సిటీపై రూ.88 వేలు, సిటీ ఈ:హెచ్‌ఈవీపై రూ.65 వేల వరకు, ఎలివేట్‌పై రూ.55 వేలు డిస్కౌంట్‌ను కల్పిస్తున్నది. ఈ సందర్భంగా కంపెనీ వైస్ ప్రెసిడెంట్ కునాల్ బెహ్లా మాట్లాడుతూ..కంపెనీ కార్లను కొనుగోలు చేసేవారికి ఆర్థిక ప్రయోజనాలు కల్పించాలనే ఉద్దేశంతో ఈ సమ్మర్ బొనాంజా ఆఫర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు చెప్పారు.

నయా చేతక్ ఈ-స్కూటర్

సింగిల్ చార్జింగ్‌తో 123 కి.మీ.

న్యూఢిల్లీ, జూన్ 8:మార్కెట్లోకి నయా ఎలక్ట్రిక్ స్కూటర్‌ను విడుదల చేసింది బజాజ్ ఆటో. చేతక్ 2901 పేరుతో విడుదల చేసిన ఈ మాడల్ ధర రూ.95,998గా నిర్ణయించింది. ఈ ధరలు బెంగళూరు షోరూంనకు సంబంధించినవి. ఐదు రంగుల్లో లభించనున్న ఈ నయా మాడల్ అడ్వాన్స్ టెక్నాలజీతో తీర్చిదిద్దింది. సింగిల్ చార్జింగ్‌తో 123 కిలోమీటర్లు ప్రయాణించే ఈ స్కూటర్ సులువుగా ఎత్తైన గుట్టలు ఎక్కనున్నది. ఈవీ పరిధిని మరింత విస్తరించాలనే ఉద్దేశంతో ఈ నయా మాడల్‌ను తీర్చిదిద్దింది. ప్రస్తుతం మార్కెట్లో లభిస్తున్న పెట్రోల్ స్కూటర్ ధర స్థాయిలోనే ఈ స్కూటర్ ధర ఉన్నదని, ఈ నెల 15 నుంచి విక్రయాలు ప్రారంభిస్తున్నట్లు కంపెనీ వర్గాలు వెల్లడించాయి.

పెట్టుబడులకు డెల్టా ఎయిర్‌లైన్స్ సుముఖం

కంపెనీ ప్రతినిధులతో రాష్ట్ర బృందం సమావేశం

హైదరాబాద్, జూన్ 8(నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి అమెరికాకు చెందిన ప్రముఖ విమానయాన సంస్థ డెల్టా ఎయిర్‌లైన్స్ సుముఖత వ్యక్తం చేసినట్లు రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. తెలంగాణకు పెట్టుబడులు రాబట్టడమే లక్ష్యంగా శ్రీధర్ బాబు నేతృత్వంలో రాష్ట్ర బృందం అమెరికాలో పర్యటిస్తున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా శనివారం మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో కలిసి అట్లాంటాలోని డెల్టా ఎయిర్‌లైన్స్ ప్రధాన కార్యాలయంలో కంపెనీ వైస్ ప్రెసిడెంట్, సీటీవో నారాయణన్ కృష్ణకుమార్‌తో ప్రత్యేకంగా భేటీ అయ్యారు.

నేరుగా అట్లాంటాకు విమాన సేవలు...

హైదరాబాద్ నుంచి నేరుగా అట్లాంటాకు విమాన సర్వీసులు నడపడానికి డెల్టా ఎయిర్‌లైన్స్ సానుకూలంగా స్పందించిందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. ఇరు నగరాల మధ్య విమాన సర్వీసులు లేకపోవడంతో విద్యాభ్యాసం కోసం వచ్చే విద్యార్థులు, ఇతర ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురికావాల్సి వస్తున్నదన్నారు. దీనిపై కంపెనీ వర్గాలు సానుకూలంగా స్పందించాయి.

ఆయనొక మార్గదర్శి



ప్రారంభించిన వ్యాపారాలు

- ప్రకటనల వ్యాపారం కోసం 1965లో కిరణ్ యాడ్స్ పేరుతో ప్రత్యేకంగా సంస్థను ప్రారంభించారు.
- 1967-69 మధ్యకాలంలో ఖమ్మం వేదికగా వసుంధర ఫర్టిలైజర్స్ పేరుతో ఎరువుల వ్యాపారాన్ని నిర్వహించారు. ఆ తర్వాత అన్నదాత పత్రికను ప్రారంభించడంతో ఈ వ్యాపారానికి స్వస్తి పలికారు.
- ప్రస్తుతం 16 భారతీయ భాషల్లో ఈటీవీ చానెళ్లను నిర్వహిస్తున్నారు.

హైదరాబాద్, జూన్ 8 (నమస్తే తెలంగాణ) : వ్యాపార రంగానికి ఆయనొక మార్గదర్శి. ఏ పనైనా దూరదృష్టితో ప్రణాళికవేస్తే విజయం సాధిస్తామన్న ధీమా ఈనాడు సంస్థల చైర్మన్ రామోజీరావుకు పుట్టుకతోనే వచ్చింది. తాను మొదలు పెట్టే ఏ కార్యక్రమమైనా తాత్కాలికంగా కాకుండా.. దీర్ఘకాలికంగా నిలువాలనే ఉద్దేశంతో అడుగులు వేశారు. కృషి, పట్టుదలతో విజయవంతంగా ముగించాలని భావిస్తుంటారు కాబట్టే ఆయన చేపట్టినదేదైనా బంగారమైంది. శూన్యం నుంచి చరిత్రను లిఖించగలిగిన వ్యక్తిగా ఎదిగారంటే కారణం ఆయన క్రమశిక్షణే. అందుకే ఆయనొక వ్యాపార మార్గదర్శిగా నిలిచారు.

ఢిల్లీలోనే వ్యాపార బీజాలు..

గుడివాడలో ఇంటర్మీడియట్ చదివిన తర్వాత తొలి ఉద్యోగం దేశ రాజధాని ఢిల్లీలో చేశారు. 'అనంత్' అనే మలయాళీ స్థాపించిన ఒక యాడ్ ఏజెన్సీలో ఆర్టిస్ట్‌గా చేరారు. అక్కడ తన డెడికేషన్ చూసి ఆ యజమాని ఉప్పొంగిపోయేవారు. అప్పుడే గొప్ప విజయాలు సాధించవచ్చన్న ఆత్మవిశ్వాసం ఆయనలో పెరిగింది. వచ్చిన అమెరికా అవకాశాన్ని కుటుంబం కోసం వదులుకొని.. 1962 అక్టోబర్‌లో మార్గదర్శి చిట్‌ఫండ్స్‌ను స్థాపించారు. చిట్టీల వ్యాపారమంటే గృహిణుల వ్యవహారమన్న రోజుల్లోనే మార్గదర్శిని ఓ మార్గదర్శకంగా తీర్చిదిద్దారు. వసూళ్లు, చెల్లింపులు కచ్చితంగా ఉండటంతో ఖాతాదారుల్లో విశ్వాసం ఏర్పడింది. సిబ్బంది క్రమశిక్షణ, అంకితభావం, యాజమాన్య విశ్వసనీయత కారణంగా సంస్థ వేగంగా అభివృద్ధి చెందింది.

ఆతిథ్య రంగంలోనూ... హవా

సాగర తీర సుందర పట్టణం విశాఖలో డాల్ఫిన్ హోటల్‌ను 1980లో ప్రారంభించారు. విశాఖ పెద్ద పర్యాటక నగరంగా అభివృద్ధి చెందుతుందని ముందస్తు అంచనాతో ఆయన.. త్రీస్టార్ హోటల్‌గా దీనిని ప్రారంభించారు. ఇదే క్రమంలో ఆతిథ్య రంగానికి పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని రామోజీ ఫిల్మ్ సిటీలోనే తార, సితార స్టార్ హోటళ్లను నిర్మించారు. సహారా, శాంతినికేతన్‌లు దీని ఆధ్వర్యంలోనే నడుస్తున్నాయి.

ప్రియా పచ్చళ్లకు డిమాండ్..

తెలుగువారి వంటింటి రుచుల్ని ప్రపంచానికి అందించాలనే ఉద్దేశంతో రామోజీరావు 1980లో ప్రియా పచ్చళ్ల వ్యాపారానికి శ్రీకారం చుట్టారు. కృష్ణా జిల్లా పోరంకి గ్రామంలో ఆరు రకాల ఊరగాయలతో ప్రారంభమైన ఈ వ్యాపారం ప్రస్తుతం 205 రకాల ఉత్పత్తులను ప్రపంచవ్యాప్తంగా విక్రయిస్తున్నది.

సాంస్కృతిక వైభవం 'కళాంజలి'

హస్తకళలు, వస్త్ర సోయగాలకు వేదికగా నిలిపేందుకు ఆయన కళాంజలిని 1992లో ప్రారంభించారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను ఇనుమడింపజేసే చేతివృత్తి కళాకారులను ప్రోత్సహిస్తూ హైదరాబాద్‌లో ప్రారంభమై... విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి వంటి ప్రముఖ నగరాలకు షోరూంలను విస్తరించారు. తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, తమిళనాడు, ఒడిశా, అస్సాం, కేరళతోపాటు దేశవ్యాప్తంగా విస్తరించారు.

రామోజీ ఫిలిం సిటీకి గుర్తింపు

హైదరాబాద్ వేదికగా 1996లో రామోజీ ఫిలిం సిటీ ఆరంభమైంది. సాధారణ చిన్న సినిమాలతోపాటు, హాలీవుడ్ చిత్రాలు సైతం ఈ ఫిలిం సిటీలో షూటింగ్‌లు జరుపుకుంటున్నాయి. బిగ్గెస్ట్ ఫిలిం ప్రొడక్షన్ సెంటర్‌గా ఈ ఫిలిం సిటీని గిన్నిస్ రికార్డు సైతం వరించింది.